అందని 'మధ్యాహ్నం' బిల్లులు

- ఐదు నెలలుగా ఇబ్బందుల్లో వంట ఏజెన్సీలు
- అప్పులు చేసి వండుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు


అమరవాయిలో వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బిల్లులు ఐదు నెలలుగా అందకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా ప్రభుత్వం నుంచి బిల్లులు అందాల్సి ఉండగా, పెరిగిన ధరలకు అనుగుణంగా, ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు కిరాణం, కూరగాయలు, గుడ్లు, అరటి పండ్ల బిల్లులు అవుతున్నాయి. అప్పులు చేసి ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు తమ వల్ల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే తాము ఏజెన్సీల నుంచి తప్పుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. అప్పులు చేసి సరుకులు తెచ్చినా బిల్లులు సకాలంలో ప్రభుత్వం నుంచి రాకపోవడంతో సరుకుల యజమానులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీంతో ఇటు మధ్యాహ్న భోజనం వండలేక, అప్పులు తీర్చలేక ప్రతి రోజు మనోవేదనకు గురికావాల్సి వస్తోందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. వంట చేయడం మానేస్తామని వంట ఏజెన్సీ మహిళలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 6,848 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం 40 పాఠశాలలకు వంట ఏజెన్సీలు 40 ఉండగా, వాటిలో 112 మంది వంట నిర్వాహకులు పనిచేస్తున్నారు. వారికి ప్రతి నెలా రూ.12లక్షల బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండగా, ఐదు నెలలుగా సుమారు రూ.50 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్లు అందించాలని నిబంధన విధించగా ప్రభుత్వం ఇస్తున్న గుడ్డు ధర రూ.4 కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.6లకు పైగా పలుకుతోందని పేర్కొన్నారు. తమపై అదనంగా రూ.2 చొప్పున భారం పడుతోంది. వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్లు, అరటి పండ్లు అందిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యాశాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వంట కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.


మల్దకల్‌లో భోజనం వండుతున్న నిర్వాహకులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



ఐదు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరీలో కొంత ఆలస్యమైంది. వచ్చిన వెంటనే వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లిస్తాం.

– కొండారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ, మల్దకల్

వడ్డీలు కట్టలేకపోతున్నాం..



ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకపోవడంతో ఇతరుల నుంచి వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గుడ్లు అందించాం. గుడ్ల ధరలు పెరగడంతో మరింత భారం పెరిగింది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– యాదగిరి, అమరవాయి, వంట ఏజెన్సీ నిర్వాహకుడు

గౌరవ వేతనం పెంచాలి..



ప్రభుత్వం వంట ఏజెన్సీలకు చెల్లించే గౌరవ వేతనం పెంచాలి. ప్రతి నెలా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు అప్పులు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఇప్పటికే ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు బిల్లులు అందేలా చర్యలు తీసుకొని తమకు గౌరవ వేతనం పెంచాలి.

– గోవర్ధనమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, మల్దకల్

కిరాణ దుకాణాల్లో సరుకులు ఇవ్వడం లేదు



విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం కోసం కిరాణం దుకాణంలో సరుకులు ఉద్దెర ఇవ్వడం లేదు. నాలుగు నెలలు పెండింగ్ బిల్లులు ఉండటంతో సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇతరులతో తీసుకున్న అప్పులు చెల్లించేందుకు బిల్లులు రాకపోవడంతో వారి నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.

– సత్యమ్మ, మల్దకల్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని సబ్ స్టేషన్ నుంచి పుల్లూరు ఫీడరులో పలు మరమ్మతులు, వడ్డేపల్లి మండలం 33/11కేవీ నుంచి రామపురం, బుడ్డారెడ్డి పల్లి ఫీడర్ పరిధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం కోసం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ సయ్యద్ చిన్న మగ్బుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ టౌన్ ఏరియాలో విద్యుత్ నియంత్రికల దగ్గర ఎర్తింగ్ పునరుద్ధరణ పనులు చేస్తారని, వాటికి ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



గద్వాలఅర్బన్: ఈనెల 20, 21వ తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి కళాకారులు అధికసంఖ్యలో పాల్గొని కళామంచ్ సింగిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ కళామంచ్ ప్రముఖ్ కరుణాకర్, అధ్యాపకులు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను మంగళవారం ఏడీఏ సంగీతలక్ష్మి తనిఖీ చేశారు. గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, బల్గెర గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు ఎరువుల బస్తాపై ఉన్న ధరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను దుకాణం బయట బోర్డుపై తెలియజేస్తూ, వాటి ధరలను తెలియజేయాలన్నారు.

వీఎస్‌టీ సంజీవని వాహన క్లినిక్ ప్రారంభం



ఉండవెల్లి: మండలంలోని డీబూడిదపాడు శివారులోని వీఎస్‌టీ ప్రైవేట్ కంపెనీ అనుసంధానంలో వీఎస్‌టీ సంజీవని క్లినిక్ వాహనాన్ని ఆ సంస్థ మేనేజర్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. పొగాకు రైతుల ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని క్లినిక్ వాహనంగా మార్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాతబోర్లకు మరమ్మతు చేపడుతున్నాం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్ద ఆముదాలపాడు, అమరవాయి, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో పాతబోర్లకు మర్మతులు చేస్తున్నామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, మిషన్‌భగీరథ ఏఈ రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. గ్రామంలో నీటీ ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. గ్రామంలో ఏవైనా పాత బోర్లు నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



అయిజ: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని సంకాపురంలో మంగళవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో ఓటమి, గెలుపులు సహజమని, గెలుపు కోసం ఆఖరి క్షణం వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, నాగరాజు, కృష్ణ, తిమ్మారెడ్డి, గోపాల్, బాషా, అన్నమయ్య, జయన్న, మహేష్, గోవర్ధన్, మాదన్న ఉన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘననివాళి


సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాలఅర్బన్: బహుజన రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటాలు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్ సరిత సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని స్థాపించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ఆయన అడుగుజాడల్లో నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిలిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలరు నరహరిగౌడ్, నాయకులు ఆనంద్, శ్రీనివాస్‌గౌడ్, గోవిందుగౌడ్, జనార్దన్‌గౌడ్, ఇసాక్, భాస్కర్ యాదవ్ ఉన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్‌ను జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ పద్మశాలి సంఘానికి ఉన్నతమైన సేవలు అందించి గద్వాల ప్రాంతానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, ఎల్లప్ప, నరహరిగౌడ్, ఇసాక్, డీటీడీసీ నర్సింహులు ఉన్నారు.


శాంతినగర్‌లో సర్దార్ పాపన్నగౌడ్‌కు నివాళులు

పోరాట యోధుడు సర్దార్ పాపన్నగౌడ్

శాంతినగర్: బహుజనుల రాజ్యాధికార యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడసంఘం నాయకులు కొనియాడారు. మొగలాయి అరాచకాన్ని ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గౌడ కులానికి వన్నెతెచ్చిన సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్రామన్‌గౌడ్, జయన్నగౌడ్, శ్రీనివాసులుగౌడ్, మద్దిలేటిగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు మంగళవారం గద్వాల ఎంబీ మిస్పా చర్చి సంఘ సభ్యులు పండ్లు, బ్రెడ్లను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. ఏసు ప్రభు తన బోధన ద్వారా ఒకరిపై ఒకరు ప్రేమ, దయ, జాలి చూపించి సన్మార్గంలో నడావల్సిందిగా ప్రజలను చైత్యనం దిశగా నడిపించారన్నారు. మనుషులు చేసిన తప్పిదలకు తను శిక్షను అనుభవించి మరణించి తిరిగి జన్మించాడన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగ దేశవ్యాప్తంగా నిర్వహించారన్నారు. అందుల్లో భాగంగా రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సోని చార్లెస్, మరియమ్మ, ఏలిషమ్మ, పద్మ, శోభ, సుధాకర్ సైమన్, ప్రభుదాస్, రవి తదితరులు ఉన్నారు.


రోగులకు పండ్లు అందిస్తున్న చర్చి సభ్యులు

వరిధ్యానం కొనుగోళ్లు ప్రారంభం


మద్దూరులో వరి కొనుగోలు ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారులు

మానవపాడు: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని మద్దూరులో మంగళవారం పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆదేశానుసారం సీఈఓ మద్దిలేటి అధ్యక్షతన యాసంగి సీజన్ 2023–24ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధర క్వింటాలు 'ఎ' గ్రేడ్ రూ. 2203, కామన్‌గ్రేడ్ రూ.2183 వరి ధ్యానం కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ధ్యానం మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్, వీఆర్‌ఓ సాగు పత్రం వెంట తీసుకొని మద్దూరు సెంటర్‌నందు సహకార అధికారులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ ప్రభాకర్‌నాయుడు, సాయికుమార్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కార్పొరేట్ లీడర్లు ప్రజానాయకులు కాలేరు'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గద్వాల రూరల్: డబ్బులు పెట్టి పదవులు కొనుక్కునే కార్పొరేట్ లీడర్లు ఎప్పటికీ ప్రజానాయకులు కాలేరని జెడ్పీ చైర్‌పర్సన్ సరితను ఉద్దేశించి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డీకే బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా సాధన కోసం డీకే అరుణమ్మ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని, జెడ్పీ చైర్‌పర్సన్ పార్టీ మారి ఎమ్మెల్యేగా ఓటమి చెందినప్పటికీ ఇంకా పదవిలోనే కొనసాగుతుండడం దేనికి నిదర్శమని నిలదీశారు. బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే బీఆర్‌ఎస్ పార్టీలో జెడ్పీచైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు ఎంతోమంది బీసీ, ఎస్సీ, ఎస్టీలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేసినప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ఇవన్నీ గమనించిన ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని, గద్వాలలో గెలవలేని వారు మహబూబ్‌నగర్‌కు వెళ్లి చేసేదేమీ లేదని ఎద్దెవా చేశారు. కార్యక్రమంలో రవి ఎక్బోటే, రామాంజనేయులు, కిష్టన్న, దేవదాస్, అనిల్, రామిరెడ్డి, తిరుమల్, నర్సింహ పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రానికి బారులు దీరిన భక్తులు


పాదయాత్ర భక్తులకు మజ్జిగ, నీళ్లప్యాకెట్లు అందిస్తున్న మంటిస్సోరి యాజమాన్యం


ఉండవెల్లి చేరిన సిద్ధరామేశ్వర స్వామి రథం

అలంపూర్ రూరల్: శ్రీశైల క్షేత్రంలోని మల్లికార్జున స్వామి దర్శనార్థం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి దర్శనార్థం భక్తులు వేలాది అలంపూర్ క్షేత్రం నుంచి బయలు దేరుతున్నారు. భక్తుల కోసం మంటిస్సోరి పాఠశాల యాజమాన్యం వారు మజ్జిగా, చల్లటి నీటి ప్యాకేట్లను అందజేస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్ పాదయాత్ర భక్తులకు స్వేదతీరేందుకు షామియాన వేయించి వారికి చల్లని నీళ్లు అందిస్తున్నారు. భక్తుల వల్ల అలంపూర్ రద్దీతో కిక్కిరిస్తోంది. టిఫిన్ హోటల్స్, చాయ్‌దుకాణాల దగ్గర, కిరణం షాపుల దగ్గర రద్దీ నెలకొంటుంది. భక్తులు వందలాది కిలో మీటర్ల పాదయాత్ర చేసుకుంటు శ్రీశైలానికి బయలుదేరుతున్నారు.

21 ఏళ్లుగా పాదయాత్ర

ఉండవెల్లి: కర్ణాటక రాష్ట్రం నుంచి సిద్ధరామేశ్వర సంస్థానదిపతుల గురువులు సిద్ధరామేశ్వర స్వామి రథాన్ని శ్రీశైలానికి 20 ఏళ్ల పూర్తి చేసుకుని, 21 ఏటా పాదయాత్రగా భక్తులకు కనువిందు చేస్తూ అలంపూర్ పుణ్య క్షేత్రం మీదుగా వెళ్తూ మంగళవారం ఉండవెల్లికి చేరింది. జాతీయ రహదారి నుంచి ఉండవెల్లి మీదుగా అలంపూర్ పుణ్యక్షేత్రానికి రథంతో పాటు భక్తులు పాదయాత్ర చేసుకుంటూ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాల మీదుగా వెళ్తున్నారు.

అంబేద్కర్ పండుగను జయప్రదం చేద్దాం

శాంతినగర్: ఈనెల 12న గద్వాలలో నిర్వహించే అంబేద్కర్ ఆలోచన పండుగ వేడుకలను జయప్రదం చేద్దామని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రామ్మోహన్, వెంకట్రాములు, టీచర్ మోహన్, మాచర్లప్రకాష్, హృదయరాజులు మంగళవారం సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. గద్వాల జిల్లా కేంద్రంలో ఈనెల 12 ఉదయం 10 గంటలకు అంబేద్కర్ చౌరస్తా నుంచి కేఎస్ ఈవెంట్ హాల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. తన జీవితమంతా దారపోసి కోట్లాదిమంది బతుకులను బాగుచేసిన బాబా సాహెబ్ అంబేద్కర్ కోసం ఒక్కరోజు సమయం కేటాయించి దళిత బహుజనులు, అన్ని వర్గాల వారు ప్రజాసంఘాలు, ఉద్యోగులు ఉపాధ్యాయులు, అంబేద్కర్ వాదులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కదిలిన జిల్లా యంత్రాంగం



సాక్షి ఎఫెక్ట్..

కేటీదొడ్డి: గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రం కావడంతో మంగళవారం 'సాక్షి' దినపత్రికలో అడుగంటిన భూగర్భ జలాలు.. గ్రామాల్లో తాగునీటి సమస్య' అని ప్రచురించడంతో జిల్లా అధికార యంత్రాంగం డీపీఎం రూపమ్మ, ఎంపీఓ సయ్యద్‌ఖాన్ గ్రామాల్లో తాగునీటి సమస్యపై మంగళవారం పర్యటించారు. మండలంలోని ఉమిత్యాలతండా, సోంపురంలో గ్రామాల్లో సమస్యపై ప్రజలతో చర్చించి అక్కడక్కడ నల్లా కలెక్షన్లు ఇళ్లకు మాత్రమే వచ్చేలా కలుపుకున్న వారిని గుర్తించి వారికి నోటీసులు అందజేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని బోర్లను మరమ్మతులు చేయించి తాగునీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిచాలని అధికారులకు సూచించారు.

సేవలు గుర్తుండిపోతాయి



గద్వాల రూరల్: ఉద్యోగులు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. గద్వాల మున్సిపాలిటీలో ఆర్‌ఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన రాములును తన ఛాంబర్‌లో కౌన్సిలర్లతో కలిసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం రిటైర్‌మెంట్ తర్వాత జీవితం కాలం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1, 10, 11 వార్డులలో దోమల నివారణకు పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. తెలుగుపేట, కత్తి మాన్యం, దుర్గానగర్, గుర్రంతోట, మేకలపేట, కమతం పేట కాలనీల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేదన్న, వార్డు ఆఫీసర్ రషీద్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ సురేష్, శానిటేషన్ జవాన్లు, సురేందర్, ఆనంద్ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల కరపత్రాల విడుదల

అయిజ: డాక్టర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా నిర్వహించనున్న వ్యాసరచన పోటీలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ విజయభాస్కర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈనెల 6న మండల కేంద్రంలోని కాకతీయ స్కూల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ జీవిత చరిత్ర, రాజ్యాంగ రచన ఎన్నిక కోసం అంబేద్కర్‌కు ఎదురైన సవాళ్లు, బీసీ రిజర్వేషన్ కోసం అంబేద్కర్ పోరాటం, ఆయన మంత్రి పదవి రాజీనామా గురించి వ్యాసం రాయాల్సి ఉంటుందని తెలిపారు. విజేతలకు మెదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు, మూడో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని తెలిపారు. పరీక్షలో పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్ లేదా స్కూల్ ఐడీ కార్డ్ తీసుక రావాలని సూచించారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్‌ఐ విజయభాస్కర్

వడదెబ్బ నివారణపై చైతన్యం చేయాలి

పాన్‌గల్: ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించడంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గర్భిణుల పేర్లు నమోదు, కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పౌష్టికాహారం, రక్తహీనత గురించి వివరించాలన్నారు. పీహెచ్‌సీలోనే కాన్పులు అయ్యేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ సంతోషమ్మ, సిబ్బంది రాంచందర్, సతీష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ రామయ్య

ఈద్గాల వద్ద వసతులు కల్పించండి

అమరచింత: పట్టణంలోని ఈద్గా వద్ద పవిత్ర రంజాన్ నమాజు కోసం వస్తున్న భక్తులకు వసతులు కల్పించాలని జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈద్గా ప్రాంగణం ముళ్లపొదలతో నిండుకుందని, వాటిని శుభ్రపర్చడంతో పాటు నీటి వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. పవిత్ర ప్రార్థన కోసం వస్తున్న ముస్లిం మైనార్టీల కోసం నీడ సౌకర్యం కల్పించాలన్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్సారీ, తౌఫిక్, అస్సు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి స్వయంభు వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 200ఏళ్ల కిందట నుంచి గ్రామంలో స్వయంభు వేంకటేశ్వరుడిగా (గుండు) పూజలు పూజలు చేస్తుండేవారు. ఐదేళ్ల క్రితం గ్రామస్తులందరూ చందాలు పోగు చేసి ఆలయాన్ని నిర్మించుకున్నారు. నేటి నుంచి మూడు రోజుల ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు, మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, ధాన్యధివాసం, హోమాలు, రెండో రోజు అభిషేకం, అలంకరణ విగ్రహాల ప్రతిష్ఠ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, మూడో రోజు అఖండ భజన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వర్ రెడ్డి అన్నారు. పీఏసీఎస్ పెద్దమందడి ఆధ్వర్యంలో మండలంలోని పామిరెడ్డిపల్లిలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు.

